

Dr.G.Rajesh
CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 99 ఎడిటర్ : జి.రాజేష్ ఆదివారం 05 జులై 2026 పేజీలు : 6 వెల రూ. 4.00

## నివారణే ఆరోగ్య సంరక్షణకు మూలం

పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు



- రూ.1.70 కోట్లతో సీటీ స్కాన్ కేంద్రం
- మూత్రపిండ శుద్ధి కేంద్రం ప్రారంభం
- ప్రతి పౌరుడి ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం : సీఎం
- కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం
- డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం

కుప్పం,ఐఎన్‌బిటైమ్స్ కుప్పంలో వివిధ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి నేరుగా కుప్పం వచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పొగురుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

- మిగతా 2లో పేజిలో



## పట్టణాల సమగ్రాభివృద్ధికి కృషి

2లో

- మున్సిపాలిటీల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు
- ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి రూ.57 కోట్లు
- రాజమహేంద్రవరం అభివృద్ధి, గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు రూ.580 కోట్లతో కార్యాచరణ
- 2028 ఆగస్టు నాటికి అమరావతిలో కీలక నిర్మాణాలు పూర్తి
- ప్రతి పట్టణాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి నారాయణ

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ఆహార భద్రతను కట్టుదిట్టంగా అమలు
- డ్రగ్ కంట్రోలర్ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలసి పనిచేయాలి
- అధికారులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం
- వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి
- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్



హైదరాబాద్,ఐఎన్‌బిటైమ్స్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని

మిగతా 2లో



## కవితకు ఎన్నికల సంఘం షాక్

- టిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి

2లో

## స్వర్ణ కుప్పం'కు నాంది

-రూ.118 కోట్లతో మోడల్ బస్ స్టేషన్, డిపోకు శంకుస్థాపన




- 61 ఏళ్ల కంగుంది భూ సమస్యకు ముగింపు
- 322 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసిన సీఎం
- సామాజిక న్యాయంపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని ముఖ్యమంత్రి వ్యాఖ్య
- ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాలు పరిష్కరిస్తాం
- అభివృద్ధి కోసం యజ్ఞం చేస్తుంటే? రాక్షసుల్లా అడ్డుపడుతున్నారు : సీఎం చంద్రబాబు

-కుప్పంలోనూ గోల్డ్ ఫీల్డ్స్

-సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసింది... ఇప్పుడు అభివృద్ధే అజెండా

-కుప్పం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

కుప్పం, ఐఎన్‌బిటైమ్స్

: స్వర్ణ కుప్పం లక్ష్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కుప్పంలో రూ. 118 కోట్లతో నిర్మించనున్న ఆధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపోకు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అభివృద్ధి అంశాలతో పాటు గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వివేకానందరెడ్డి హత్య నుంచి కోడికత్తి ఘటన, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అమరావతి రాజధాని, కుప్పం అభివృద్ధి వరకు గత ప్రభుత్వంలో జరిగిన విధానాలను ముఖ్యమంత్రి ఎండగట్టారు. ఉద్యోగాల కోసం కుప్పమే రావాలి..ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అత్యాధునిక మోడల్ బస్

మిగతా 2లో



## వైట్ గట్ పై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

- ప్రభావిత చెరువుల నుంచి నమూనాల సేకరణ
- రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన పర్యవేక్షణ
- రొయ్యల రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలోని పలు ఆక్వా ప్రాంతాల్లో రొయ్యలలో వైట్ గట్ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయనే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై, యుద్ధ ప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం మహదేవిపట్నంలో రైతు పి. మనోజ్ వర్మ చెరువును మత్స్యశాఖ అధికారులు పరిశీలించి, నీరు, రొయ్యలు, ఫీడ్, మల నమూనాలను

మిగతా 2లో



## నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

- అపరిశుభ్ర వాతావరణం..కల్తీ పదార్థాలు
- దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు
- వందరోజుల్లో 185 కేసులు నమోదు

2లో


## జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

- వీరిద్దరూ సంఘ విద్రోహ శక్తులనడంలో సందేహం లేదు
- తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో ప్రకాశ్ రాజ్ ఆస్కింగ్
- అక్కడి డబ్బుల కోసం ఇద్దరూ రాష్ట్రంలో ఘర్షణలకు యత్నం
- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంగా ప్రకాశ్ రాజ్ చర్యలు
- ఘాటు విమర్శలు చేసిన మంత్రి



## భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

- అప్పులపై తప్పుడు లెక్కలు రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు
- బిఆర్ఎస్ దిగిపోయేనాటికి అప్ప రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే.
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు



2లో

# నివారణే ఆరోగ్య సంరక్షణకు మూలం

కుప్పం,స్వర్ణ కుప్పం దార్శనిక ప్రణాళిక--2029లో భాగంగా కుప్పం ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.1.70 కోట్ల వ్యయంతో భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఆధారిత శరీర చిత్రీకరణ (సీటీ స్కాన్) కేంద్రాన్ని, అపోలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూత్రపిండ శుద్ధి (డయాలసిస్) కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న చికిత్స, సంజీవని కార్యక్రమం అమలు తీరును పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు.

సీటీ స్కాన్ కేంద్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి, ఈ కేంద్రం ద్వారా కుప్పం, పరిసర ప్రాంతాల ప్రజలకు మెదడు, ఛాతీ, ఉదర భాగాలకు సంబంధించిన వ్యాధులను అత్యాధునిక సాంకేతికతతో స్థానికంగానే గుర్తించే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభించవచ్చని తెలిపారు.మూత్రపిండ శుద్ధి కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో ముఖ్యమంత్రి



మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 45 వేలకుపైగా డయాలసిస్ చికిత్సలు అందించగా, ప్రస్తుతం 233 మంది నిరంతర చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రోజుకు మూడు విడతల్లో సుమారు 45 మందికి చికిత్స అందిస్తున్నామని, మరో 500 మంది వరకు వేచి ఉన్నందున సేవలను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. కర్ణాటక, బెంగళూరు, కృష్ణా జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడికి రావడం సేవల నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. పరిశీలించిన ముఖ్యమంత్రి, ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలు ఒకేచోట అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సమాచారాన్ని సమగ్రంగా



అనుసంధానం చేసి ప్రతి పౌరుడికి ఒకే ఆరోగ్య చరిత్ర నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే వ్యాధులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని చంద్రబాబు అన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషించి ప్రజారోగ్య విధానాలు రూపొందించాలని సూచించారు. రోగులు మందులు సక్రమంగా తీసుకుంటున్నారా, చికిత్స కొనసాగిస్తున్నారా అనే అంశాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రిస్తే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

హైదరాబాద్,జులై4 ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు.రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

హైదరాబాద్,జులై4: కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు.

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఐ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు.

# స్వర్ణ కుప్పం'కు నాంది

స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని చంద్రబాబు తెలిపారు. డిపోలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా తీర్చిదిద్దే దిశగా పరిశ్రమలు తీసుకొస్తున్నామని, ఉద్యోగాల కోసం కుప్పం ప్రజలు బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇతర ప్రాంతాల వారు కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఎంఓయూలు జరిగాయని, వాటి ద్వారా సుమారు 80 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరించారు. అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థ కోసం అనేక రాష్ట్రాలు పోటీ పడినా అది కుప్పాన్నే ఎంచుకుందని చెప్పారు. టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ పరిశ్రమతో పాటు డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు కూడా కుప్పానికి వచ్చాయని వెల్లడించారు

**కుప్పంలోనూ బంగారు గనులు..**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించినట్లే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని చెబుతున్నారని, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని అందుబాటులోకి తీసుకొచ్చి స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతామని ప్రకటించారు. మైక్రో ఇరిగేషన్‌లో కుప్పం దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్న సీఎం రాష్ట్రానికి అది శ్రీరామరక్షగా మారిందన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి నీరు తీసుకొచ్చి 110 చెరువులు నింపామని చెప్పారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహించి రాయలసీమను అభివృద్ధి చేస్తామని, వచ్చే నెలలో మదనపల్లెలో దానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కుప్పంలో



రోజుకు 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా డెయిరీ రంగాన్ని విస్తరిస్తామని, వాణిజ్య పంటలకు పెద్దపీట వేస్తామని చెప్పారు.

**కాలుష్య రహిత కుప్పం నిర్మిద్దాం..**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, బీసీలు, ఓసీల ఇళ్లపైనా రూ.552 కోట్లతో సోలార్ విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. నెట్ జీరో విధానంలో భాగంగా ఇంటి మిద్దెలపైనే కూరగాయలు పండించే విధానాన్ని ప్రోత్సహించాలని, ఈ-సైకిళ్ల వినియోగం పెంచి కాలుష్యరహిత కుప్పాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ ఆధారిత జీవన విధానం వైపు వెళ్లాలని సూచించారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, అందుకే హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గమంతా మొబైల్ కనెక్టివిటీ కల్పిస్తామని, తిరుమల తర్వాత అత్యధిక గ్రీన్ కవర్ ఉన్న ప్రాంతం కుప్పమేనని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సదుపాయాలు విస్తరించామని, ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

## పట్టణాల సమగ్రాభివృద్ధికి కృషి

ఏలూరు,:రాష్ట్రంలోని పట్టణాలను ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలు, రహదారులు, పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ మేరకు శనివారం ఏలూరు, రాజమహేంద్రవరం నగరాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు.

**ఏలూరులో సమగ్ర సమీక్ష**

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని 10 మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలు, నిధుల వినియోగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.57 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. అనంతరం శనివారపు పేటలో 35 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన లే అవుట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల పరిధిలో అభివృద్ధి చేస్తున్న లే అవుట్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

అమరావతి,జూలై4 సినీనటుడు ప్రకాశ్‌రాజ్, కాకినాడకు చెందిన యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ (రావణ్) వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్ రాజ్, జోసెఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోసెఫ్ సూచనలతో ప్రకాశ్‌రాజ్ స్పందిస్తారని విమర్శించారు. ఇద్దరి మధ్య అనుబంధం ఉందనేందుకు మా దగ్గర ఆధారాలున్నాయి. జోసెఫ్ ప్రశ్నించగానే.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెరముందు వీళ్లుంటే.. తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. వైకాపా పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారో చెప్పాలన్నారు. పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించడం అంటే.. బూతులు తిట్టడం.. వ్యక్తిగత విమర్శలు చేయడమా? ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జరిగే ఈ కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలని కందుల పిలుపునిచ్చారు. నటుడు ప్రకాష్‌రాజ్ చేసిన ట్వీట్‌పై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు



సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్ధవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సిఎం సలహాదారు,

ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వైట్ గట్ పై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ

ప్రయోగశాలకు పంపారని, నీటి నాణ్యత పరీక్షలను భీమవరం ల్యాబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.

జిల్లా జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఎఫ్ డి ఓ, ఎఐఎఫ్, విఎఫ్ఎ లు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లుగా పనిచేసి ప్రతి ఆక్వా ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని నమోదిత, నమోదుకాని హేచరీలు, ప్రైవేట్ ఆక్వా ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నాణ్యతలేని విత్తనం, నాసిరకం ఫీడ్ విక్రయాలు, తప్పుడు ల్యాబ్ నివేదికలు, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారిపై చట్టపరంగా, శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుల నుంచి రొయ్యలు, పోస్ట్ లార్వా, ఫీడ్, నీరు, మల నమూనాలను తప్పనిసరిగా సేకరించి పీసీఆర్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామని తెలిపారు. వ్యాధి వ్యాప్తికి గల కారణాలను శాస్త్రీయంగా గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు "1o1" వంటి ఆకర్షణీయ ఆఫర్ల పేరుతో నాణ్యత లేని రొయ్య పిల్లలను కొనుగోలు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. చేయాలని, చెరువు సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే పిల్లలను వదలాలని సూచించారు.

# భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

హైదరాబాద్,జూలై4బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ.15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవం టూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆం ఓఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ.4.14 లక్షల కోట్లు మాత్రమే. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు.

# ధైర్యసాహసాలకు నిలువుటద్దం అల్లూరి

## నివాళి అర్పించిన టిడిపి అధ్యక్షుడు పల్లా- వివేకానంద, కొణిజేటిలకు కూడా నివాళి

విశాఖపట్నం,జులై4 మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను



ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు రోశయ్య ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై అపారమైన అవగాహన, శాసనసభలో ఆయన చూపిన ప్రతిభ చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా రోశయ్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. నేటి తరానికి రోశయ్య జీవితం, విలువలు స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.

# నందిగామలో ఘనంగా వంగవీటి మోహనరంగా 79 వ జయంతి వేడుకలు





ఐ ఎన్ బి టైమ్స్ నందిగామ జూలై 4 నందిగామ మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండతోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో నందిగామ పట్టణ పరిధిలోని అనాసాగరం, గాంధీ సెంటర్ లో ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహాలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,రాధా రంగా మిత్రమండలి సభ్యులు రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీ సెంటర్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నందిగామ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు పారుపల్లి హరిబాబు ఏర్పాటు చేసిన అన్నదానా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసబ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా గారు పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం, వారికి మౌళిక వసతులు కల్పించడం కోసం కృషి చేశారని, ఆయన తుది శ్వాస విడిచే వరకు పేదల కోసం పోరాటం చేశారని ఆయన పేర్కొన్నారు. వంగవీటి మోహన రంగా ఆశయాలకు అనుగుణంగానే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నత కోసం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజ కవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాధా రంగా మిత్రమండలి సభ్యులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు

- భైరవ సేన అనే సంస్థ ఆరోపణలు
- అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ



డెహ్రాడూన్,జులై4అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా బద్రీనాథ్ ధామ్‌లోనూ ఇలాంటి పుకార్లు జోరందుకున్నాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ మేరకు బీకేటీసీ ప్రెసిడెంట్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలనూ కోరాం' అని తెలిపారు. కాగా.. బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భైరవ సేన అనే ఓ సంస్థ ఆరోపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడికి సంబంధమున్న నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అయితే.. దీనిపై ప్రెసిడెంట్ ద్వివేది స్పందిస్తూ.. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొన్న వ్యక్తి బీకేటీసీలో ఓ ఉద్యోగి మాత్రమేనన్నారు. ఆయన గతంలో ముగ్గురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై బీకేటీసీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోం ఆరోపణలు రావడంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాం.

కానీ ఆ ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో పూర్తివివరాలు తెలియరాలేదు. అయినప్పటికీ ఈ విషయం అత్యంత సున్నితమైనదిగా భావించి, ఛైర్మన్‌కు నివేదించాం' అని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలతో సదరు ఉద్యోగుల వివరాలు సేకరించడం సహా వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. విచారణలో ఎవరైనా తప్పుచేసినట్లు రుజువైతే.. వారిపై బీకేటీసీ చట్టం-1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కావడంతో నిరాధార ఆరోపణలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# ఇరాక్ ఎంపి అవినీతి బట్టబయలు

బాగ్దాద్,జులై4 బాత్‌రూమ్‌లోని కమోడ్‌లను కూడా కొందరు సంపన్నులు బంగారంతో తయారు చేసుకున్న ఉదంతాలు మనకు తెలుసు. కానీ ఇరాక్‌లోని ఒక ఎంపీ ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు విలువైన వజ్రాలు, బంగారం, కట్టల కట్టల డబ్బు, ఖరీదైన వస్తువులు చూసి ఆశ్చర్య పోలేదు కానీ, బంగారంతో తయారు చేసిన
ఖరీదైన లో దుస్తుల జతను చూసి షాక్ తిన్నారు. దీంతో ఈ బికినీ జత సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్న ఈ మహిళా ఎంపీ అలియా నస్సీఫ్ ఇంటి నుంచి అధికారులు 1.33 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ. 148 కోట్లు నగదు, బంగారం, నగలు, వజ్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

# సాయికృష్ణ కేసులో మెజిస్ట్రీరియల్ విచారణ

- విచారణకు హాజరైన తల్లి, కుటుంబీకులు
- సిఐ నాగరాజు తన కొడుకును మాయం చేశాడన్న తల్లి





విజయవాడ,జులై4 గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్ట్రీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త శనివారం హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులపై విజయలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని ఆమె వెల్లడించారు. ఈ కేసులో తమ కుటుంబానికి న్యాయం చేయాలని విచారణాధికారిని విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్ట్రీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, మేజిస్ట్రేట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

# వంగవీటి మోహన రంగా కు ఘన నివాళి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య





ఐ ఎన్ బి టైమ్స్ చందర్లపాడు జూలై 4 :
మాజీ శాసనసభ్యులు వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా చందర్లపాడు నిర్వహించిన వంగవీటి మోహన రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముఖ్యంగా పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధాకృష్ణతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించి మహానేతకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, వంగవీటి మోహన రంగా గారు ప్రజల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా, సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన వ్యక్తిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ప్రజా నాయకత్వానికి కొత్త నిర్వచనం ఇచ్చిన ఆయన సేవలు నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ప్రజా నాయకులు చూపిన సేవా మార్గం ప్రతి ప్రజాప్రతినిధికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం, సామాజిక సమానత్వం దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ మార్కెట్ యార్డ్ చైర్మన్ పిట్టల శ్రీదేవి, పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి మోహన రంగా కి ఘనంగా నివాళులర్పించారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు దేవినేని ఉమా ఘన నివాళి




ఐ ఎన్ బి టైమ్స్ విజయవాడ జులై 4:
భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో చెరగని ముద్ర వేసిన మన్యం వీరుడు, విప్లవ యోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గొల్లపూడిలోని తన కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయులలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, బ్రిటిష్ పాలకుల గుండెల్లో వణుకు పుట్టించిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే అత్యంత పరిమిత వనరులతో గిరిజనులను ఏకం చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాలు చేసిన అసాధారణ ధైర్యసాహసాల ప్రతిరూపం అల్లూరి అని పేర్కొన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన నడిపిన రంపా తిరుగుబాటు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నారు. దేశభక్తి, త్యాగం, ధైర్యం, పోరాట పటిమకు అల్లూరి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు.

# మన్యం వీరుడు అల్లూరి స్ఫూర్తి చిరస్మరణీయం

## కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఐ ఎన్ బి టైమ్స్ విజయవాడ జులై 04:మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయో ధుడు అల్లూరి సీతారామ రాజు పోరాట స్ఫూర్తి, త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవితం ధైర్యం, త్యాగం, దేశభక్తి, నాయకత్వానికి ప్రతీక అని.. గిరిజనుల హక్కుల పరిరక్షణకు, స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. అత్యంత పరిమిత వనరులతోనే బ్రిటిష్ సైన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించా రన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడం ఆయనకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నటి శ్రీలీల మనోగతం






టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టú÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

**నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి**

## ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్



### కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో

నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్

'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్‌పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభవవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. నిర్మాతపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.




## శరవేగంగా ప్రభాస్ స్పిరిట్ షూటింగ్

రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరుస షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇ



## నేనూ కాస్టింగ్ కౌచ్ ఎదుర్కొన్నా

### నటి పరిణీత బోర్తకుర్ వెల్లడి

సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్‌పై ఎన్నో ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. చాలామంది భయంతో బయటకు చెప్పకుండా మౌనం పాటిస్తుంటే, కొంతమంది మాత్రం సమయం వచ్చినప్పుడు తాము ఎదుర్కొన్న చేదు అనుభవాలను ధైర్యంగా పంచుకుంటున్నారు. తాజాగా ప్రముఖ నటి పరిణీత బోర్తకుర్ కూడా తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన ఒక షాకింగ్ సంఘటనను బయటపెట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పరిణీత బోర్తకుర్ సౌత్ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. సినీ రంగంలో చేదు అనుభవాలు తాను కూడా ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఒక మంచి విషయం కూడా ఉందని, ఒక వ్యక్తి అనుమతి లేకుండా ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ప్రవర్తన కూడా కీలకంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఒక దక్షిణాది సినిమా కోసం తన ఫొటోలు షార్ట్‌లిస్ట్ అయ్యాయని సమాచారం వచ్చిందని పరిణీత చెప్పారు. ఆ తర్వాత ఆఫీస్‌కు వెళ్లగా అక్కడ మరికొందరు అభ్యర్థులు కూడా ఉన్నారని తెలిపారు. కొంతసేపటి తర్వాత తననే హీరోయిన్‌గా ఎంపిక చేశామని చెప్పి ఒప్పందంపై సంతకం చేయాలని కోరారని వివరించారు. ఆ సమయంలో అంతా సాధారణంగానే అనిపించిందని, సినిమా అవకాశం రావడంతో ఆనందపడ్డానని గుర్తు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత జరిగిన సంఘటన మాత్రం తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని ఆమె చెప్పారు. మొదట తన శరీర కదలికలు తెలుసుకోవాలని దర్శకుడు చెప్పడంతో డ్యాన్స్‌కు సంబంధించిన విషయమే మాట్లాడుతున్నారని భావించానని తెలిపారు. కానీ వెంటనే మన ఇద్దరి మధ్య శారీరక సంబంధం ఉండాలని కోరుకుంటున్నానని అతను చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానన్నారు. అప్పటికి తన వయసు కేవలం 21 ఏళ్లు మాత్రమేనని, భయంతో గుండె వేగంగా కొట్టుకోవడం మొదలైందని చెప్పారు. వెంటనే అక్కడి నుంచి లేచి నిలబడి తాను ఆ సినిమా చేయనని చెప్పి బయటకు వచ్చేశానని వెల్లడించారు.

ఆ సంఘటన తర్వాత వెంటనే తన తండ్రికి ఫోన్ చేసి జరిగిన విషయం మొత్తం చెప్పానని పరిణీత తెలిపారు. తన తండ్రి కూడా సినిమా అవసరం లేదని, వెంటనే ఇంటికి వచ్చేయమని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆ దర్శకుడు ఫోన్ చేసి ఈ విషయం బయటకు చెప్పొద్దని, తాను కుటుంబానికి పెద్దవాడినని వేడుకున్నాడని వెల్లడించారు. సినిమాలో మంచి పాత్ర ఇస్తానని చెప్పినా, అలాంటి వ్యక్తితో కలిసి పనిచేయడం



తనకు ఇష్టం లేదని స్పష్టం చేసి ఆ అవకాశాన్ని పూర్తిగా తిరస్కరించానన్నారు. పని కోసం ఎప్పుడూ అక్రమ మార్గాలను ఆశ్రయించలేదని, కెరీర్ కంటే ఆత్మగౌరవానికే ఎక్కువ విలువ ఇచ్చానని పరిణీత బోర్తకుర్ స్పష్టం చేశారు.